ప్రజాశక్తి
సోమవారం 14 అక్టోబర్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కళ్లు మూసుకుంటాం.. కానివ్వండి..

ఆక్రమణదారులు కప్పేసిన ఈతల చెరువు గెడ్డ వాగు

- రోడ్డు పక్కనే ప్రభుత్వ భూమి ఆక్రమణ
- గెడ్డ వాగును కప్పేసిన వైనం
- కలెక్టర్ హెచ్చరిక బోర్డు తొలగింపు
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

జిల్లాలోని పరవాడ మండలం, ఈ బోనంగి రెవెన్యూ, గొర్లెవానిపాలెం పంచాయతీ పరిధిలోని విలువైన ప్రభుత్వ భూమి కళ్లముందే ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులకు పట్టడం లేదు. రోడ్డు పక్కనే కబ్జా పర్వం కొనసాగుతున్నా పక్క నుంచి తప్పుకుని వెళ్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కోట్ల రూపాయలు విలువజేసిన విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించి అమ్మడంలో టిడిపి, జనసేన, వైసిపి కార్యకర్తలు ఏకమవుతున్నారు. వారిని కాదనలేని రెవెన్యూ అధికారులు రాజీపపడుతున్నారు. పోనీ.. ఆక్రమించి అమ్మకాలు జరుగుతున్న ప్రభుత్వ భూమి ఎక్కడో మారుమూలది కాదు. గాజువాక - యలమంచిలి రహదారికి ఆనుకొనివున్న 297, 293 సర్వే నెంబర్లలోని రూ.25 కోట్లకు పైబడిన రెండెకరాల 12 సెంట్లు భూమి. దీన్ని చదునుచేసి ప్రయివేటు వ్యక్తులు నిర్మాణాలు చేపడుతున్నా నిలువరించే కనీస ప్రయత్నం రెవెన్యూ యంత్రాంగం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఎంతో కాలంగా సర్వే నెంబర్ 297, 293లోని ప్రభుత్వ భూమిలో శాశ్వత నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ భోనంగి రెవెన్యూలో ప్రభుత్వానికి చెందిన భూమిని ఆక్రమించిన వారిపై సెక్షన్ 4 (1), 4 (2), 4 (3) ఎపి ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 1982 ప్రకారం చర్యలు తీసుకుంటామని నాలుగేళ్ల క్రితం కలెక్టర్ హెచ్చరిక బోర్డును రోడ్డు పక్కనవున్న ఈ సర్వే నెంబర్లలోని భూమిలో ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులు ఈ బోర్డును తొలగించి, గ్రావెల్‌తో కప్పేశారు. ఆక్రమణపాలైన ప్రభుత్వ భూమిని ఇనాం కింద చెప్పి, ప్రయివేటు వ్యక్తులు లాభపడేలా కొంతమంది రెవెన్యూ అధికారులు సహాయపడుతూ వస్తున్నారు. వాస్తవానికి 1956-57 సర్వే సెటిల్‌మెంట్ ప్రకారం సర్వే నెంబర్ 297, 293లోని భూమి వాగులుగా నమోదైంది. పైన కొండల నుంచి ఈ వాగుల ద్వారా వర్షపు నీరు ఆయకట్టు కలిగిన సర్వే నెంబర్ 292లోని మిగతా 2లో..

మద్యం షాపుల వేలం ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు

- ఉదయం 8 గంటల నుంచే వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహణ
- 155 షాపులకుగాను 4139 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ వెల్లడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మద్యం షాపుల వేలం ప్రక్రియ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పక్కగా చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి స్థానిక వుడా చిల్డ్రన్ ఎరీనాలో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. దరఖాస్తులు అధికంగా వచ్చిన నేపథ్యంలో ఆశావహులు కూడా ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉందని, దానికి తగ్గ చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటర్లు ఎక్కువ ఉండేలా చూసుకోవాలని, వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను నిర్వహించామని తెలిపారు. జిల్లాలో ఉన్న 155 దుకాణాలకుగాను ఇప్పటి వరకు 4,139 దరఖాస్తులు వచ్చాయని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఈ మేరకు తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలని, సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని, ఉదయం 8 గంటల నుంచే ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ప్రక్రియ సజావుగా, సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులూ రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల షెల్టర్ల సంఖ్య పెంచరూ..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో నిరాశ్రయులను ఆదుకునే చర్యల్లో భాగంగా జివిఎంసి ఏర్పాటు చేసిన నిరాశ్రయుల షెల్టర్ల సంఖ్యను పెంచాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న షెల్టర్ల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని, వాటిని చక్కదిద్దాలని అంటున్నారు. ప్రస్తుతం నగరంలో ఎనిమిది చోట్ల నిరాశ్రయుల షెల్టర్లు ఉన్నాయి. 2011లో వీటిని ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు అన్ని షెల్టర్లలో కలిపి 6150 మంది నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించారు. జివిఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటైన భవనాలలోనే ప్రభుత్వ నిరాశ్రయుల షెల్టర్లు నాడు ఏర్పాటయ్యాయి. షెల్టర్లను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం మిగతా 2లో..

ఆరోగ్య నియమాలతో వ్యాధులు దూరం
వార్త 5లో..

నగరంలో పెళ్లి సందడి
వార్త 2లో..

ఉప్పుటేరులో చేపలు మృత్యువాత
వార్త 8లో..

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సాయిబాబాకు నివాళ్లర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి

రాజ్యహింసే ఆయన మృతికి కారణం : ప్రజా సంఘాలు వార్త 2లో..

దేవాలయ భూముల పరిరక్షణకు చర్యలు

'ప్రజాశక్తి'తో జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి సుధారాణి

ప్రజాశక్తి - అనకాపల్లి

జిల్లాలో దేవాలయ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టినట్టు జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారిణి సుధారాణి తెలిపారు. ఇటీవల ఆమెను కలిసినప్పుడు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలయాల వివరాలు, ఆయా ఆలయాలకుగల భూములు, వాటి పరిరక్షణకు చేపడుతున్న చర్యలు, ధూప దీప నైవేద్యాల కింద అర్చకులకు అందిస్తున్న గౌరవ భృతి విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

జిల్లాలోని దేవాలయాల వివరాలు తెలియజేయండి ?

దేవాలయాలను వాటి ఆదాయాలను బట్టి ఎ, బి, సి కేటగిరీలుగా విభజించాం. అనకాపల్లి జిల్లాలో మొత్తం 720 దేవాలయాలుండగా వాటిలో ఏడాదికి రూ.25 లక్షలు పైబడి ఆదాయం ఉన్న 'ఎ' కేటగిరీలో 3, రెండు నుంచి 25 లక్షలలోపు ఆదాయం ఉన్న 'బి' కేటగిరీలో 26, సున్నా నుంచి రెండు లక్షల ఆదాయం ఉన్న 'సి' కేటగిరీలో 117 ఉన్నాయి.

ధూప దీప నైవేద్యాల పథకం కింద ఎన్ని ఆలయాలు ఉన్నాయి ?

జిల్లాలో నిర్వహణలో ఉన్న 146 ఆలయాల్లో 81 ఆలయాలకు ధూప దీప నైవేద్యాల పథకం కింద ఐదు వేల రూపాయల చొప్పున అందజేస్తున్నాం. వచ్చే నెల నుంచి పది

వేల రూపాయలు చెల్లించేందుకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చాయి. అయితే భూముల ద్వారా ఆదాయం వచ్చే ఆలయాలకు ఈ పథకం

వర్తించదు.

జిల్లాలో ఆలయాలకు ఉన్న భూముల వివరాలు తెలియజేస్తారా ?

అనకాపల్లి జిల్లాలో 2666.84 ఎకరాల పల్లం, 2699.35 ఎకరాల మెట్ట భూములు, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కళ్లు మూసుకుంటాం.. కానివ్వండి

ఈతల చెరువుకు చేరేది. వాగులను కొందరు ఆక్రమించడంతో చెరువులోకి నీరు చేరక ఆయకట్టు దెబ్బతింది. స్థానికులు అనేక సార్లు ఫిర్యాదు చేసినా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించకుండా రెవెన్యూ అధికారులు మౌనందాల్చుతున్నారు.

దేవాలయ భూముల పరిరక్షణకు చర్యలు

2,23,141.47 చదరపు గజాల ఖాళీ స్థలాలు, 8.49 ఎకరాల చెరువులు, సుమారు 65 ఎకరాల ధర్మ చెరువులు, 1,13,316.89 చదరపు గజాల ఆలయ ఆవరణలు, 123.51 ఎకరాల కొండలు, అటవీ ప్రాంతాలు, 70.8 ఎకరాల మేర టైటిల్ వివాదాస్పద భూములు, ఇతరాలు 18.62 ఎకరాలు ఉన్నాయి. వీటిలో టైటిల్ వివాస్పద భూములు, ఆలయ భూములను పరిరక్షించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.

సర్వ శ్రేయో నిధి (కామన్ గుడ్ ఫండ్)ని ఏ విధంగా దేవాలయాల అభివృద్ధికి అందజేస్తారు ?

సుమారు 30 సంవత్సరాల పైబడి నిర్మాణం చేపట్టిన ఆలయాలకు, ఎటువంటి ఆదాయమూ లేకుండా దేవాదాయ, ధర్మాదాయ శాఖ పబ్లికేషన్‌లో ఉన్న ఆలయాలకు సంబంధించి పునర్నిర్మాణానికి ఈ సర్వ శ్రేయో నిధి అందజేస్తాం. 1/5 మ్యాచింగ్ గ్రాంట్ కింద మొత్తం ఆలయ అభివృద్ధికి కావలసిన మొత్తంలో ఒక వాటా ఆలయ నిర్వాహకులు భరిస్తే మిగిలిన నాలుగు వాటాలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ అందజేస్తుంది. అయితే పురాతన ఆలయాన్ని తొలగించక ముందే అందుకు దరఖాస్తు చేసుకోవాలి. ఈ అవకాశాన్ని జీర్ణోద్ధరణలో ఉన్న ఆలయాల నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలి.

జిల్లాలో సిబ్బంది కొరత ఉందా ?

ప్రస్తుతం జిల్లాలో కార్యనిర్వాహక అధికారుల పోస్టులు 13 ఉండగా గ్రేడ్ వన్ ఒక పోస్టు, గ్రేడ్ 2, 3 పోస్టులు, గ్రేడ్ 3, 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నిరాశ్రయుల షెల్టర్ల సంఖ్య పెంచరూ..

జీవిఎంసికి అప్పగించింది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి జీవిఎంసి సాయంతో, ప్రభుత్వ రంగ సంస్థల సిఎస్ఆర్ నిధులు, ఇతర దాతృత్వ సంస్థల సహకారంతో, పోలీసు అధికారుల సహకారంతో ఈ షెల్టర్లను నడుపుతూ వస్తున్నాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మహిళా సంఘం అందజేసిన వాహనాన్ని నడుపుతూ ఎప్పటికప్పుడు రైల్వే స్టేషన్, నగరంలోని ఇతర ప్రాంతాలలో నిస్సహాయంగా కనిపించిన భిక్షగాళ్లను, అభాగ్యులను, మహిళలను షెల్టర్లకు తరలించి వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ విధంగా షెల్టర్లకు వచ్చే అభాగ్యులు కొద్ది రోజులు ఉండి తర్వాత వెళ్లిపోతున్నారు. అలా వెళ్లేవారు ఏదో ఒక వృత్తి చేసుకొని జీవించడం కాకుండా మళ్లీ భిక్షాటన చేయడం, గతంలో వారు చేస్తున్న నిరుపయోగ పనులనే చేస్తూ మళ్లీ నగరంలో అక్కడక్కడా కనిపిస్తుండటం పరిపాటిగా మారింది. దీంతో షెల్టర్ల అసలు ప్రయోజనం నెరవేరడం లేదని చెప్పవచ్చు. అందుకే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇటువంటి షెల్టర్ల పనితీరును గుర్తించి, నిరాశ్రయ షెల్టర్లను ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తూ, వీటిలో ఉండే అభాగ్యులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి, వారి కాళ్లపై వారు నిలబడేలా చూడాలని ఇంధన శాఖ మాజీ కార్యదర్శి ఇఎఎస్.శర్మ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖలో కోరారు. నగర జనాభా బాగా పెరిగినందున, ఆ మేరకు షెల్టర్ల సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి లక్ష మంది జనాభాకు ఒక షెల్టర్ ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతిని ఆయన ఆ లేఖలో గుర్తు చేశారు. ఈ లెక్కన విశాఖలో ప్రస్తుతం ఉన్న జనాభా దృష్ట్యా చూస్తే కనీసం 25 షెల్టర్లు ఉండాలి. ప్రస్తుతం వీటిలో కనీసం సగం కూడా లేవు. విశాఖ నగరంతో పాటు జీవిఎంసిలో విలీనం కాబడ్డ భీమిలి, అనకాపల్లి, గాజువాక వంటి ప్రాంతాలలో కూడా ఇటువంటి షెల్టర్లను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది.

ఫుడ్ హబ్‌గా విశాఖ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ మహా నగరం ఫుడ్ హబ్‌గా నిలుస్తోందని సినీ హీరో కంచర్ల ఉపేంద్ర బాబు అన్నారు. ఆశీలుమెట్ట దరి రామ్ నగర్ బచ్ పన్ ప్లే స్కూల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డెలిష్ ఎక్స్‌ప్రెస్ ఫుడ్ హబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. డెలిష్ ఎక్స్‌ప్రెస్ రెస్టారెంట్ వినియోగదారులు మన్ననలు పొందనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖలో హోటళ్ల, రెస్టారెంట్ల సంఖ్య రోజు రోజుకూ పెరగడం సంతోషకరమన్నారు. రెస్టారెంట్ యజమాని జయశంకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ రెస్టారెంట్‌ను హీరో ఉపేంద్ర బాబు ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. త్వరలోనే యాప్ ద్వారా ఫుడ్ ఆర్డర్స్ ఇచ్చే సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. తమ సంస్థ తరపున ఫ్రాంచైజ్‌లు కూడా ఇచ్చే ప్రతిపాదన వుందన్నారు. ఇక్కడ స్టార్టర్స్, సూప్స్, మోమోస్, బిర్యానీలు, నూడిల్స్, ఫ్రైడ్ రైస్, బ్రెడ్, బర్గర్స్, పరోటా కాంబోస్, డిజర్ట్స్, తదితర చైనీస్, ఆంధ్రప్రదేశ్ కి చెందిన పలు రకాల వంటకాలు అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నట్లు తెలిపారు. ఇంటికి డెలివరీ సదుపాయం కూడా వుందన్నారు. రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించడం తమ ప్రత్యేకతని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కూనవరం : ప్రమాదంలో రెండు కాళ్లు చచ్చుబడిపోయి, జీవచ్ఛవంలా మంచానికే పరిమితమైన పెద్ద ఆర్కూరు గ్రామానికి చెందిన సోయం శంకరబాబు అనే గిరిజన యువకుడికి ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ అండగా నిలిచారు. శంకరబాబు దయనీయ పరిస్థితిని, కుటుంబం పడుతున్న మానసిన వేదన, ఆర్థిక ఇబ్బందులను వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలుసుకున్న డాక్టర్ జమాల్‌ఖాన్, స్వయంగా పెద్ద ఆర్కూరులోని బాధితుని ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. ఆరు నెలల క్రితం మినుములు కోత మిషన్ మీద పడటంతో రెండు కాళ్లు చలనం లేకుండా పోయాయని, ఆసుపత్రిలో వైద్యం చేయించినా నయం కాలేదని బాధితుడు తన బాధను డాక్టర్ జమాల్‌ఖాన్‌కు వివరించాడు. దీనిపై స్పందిస్తూ, అధైర్యపడవద్దని, బాధితుడిని, కుటుంబ సభ్యులను ఓదార్చి భరోసానిచ్చారు.

నగరంలో పెళ్లి సందడి

- డిసెంబరు ఆఖరు వరకూ ఇదే పరిస్థితి
- కల్యాణ మండపాలకు, కేటరింగ్ నిర్వాహకులకు డిమాండ్
- ఇప్పటికే అడ్వాన్స్‌ల చెల్లింపులు మొదలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

విశాఖలో పెళ్లి సందడి కనిపిస్తోంది. జూన్ నెలాఖరు నుంచి సరైన ముహూర్తాలు లేనందున వివాహాలు, శుభకార్యాలు వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు శుభ ముహూర్తాలు వచ్చాయని పురోహితులు చెబుతున్నారు. దసరా రోజు నుంచి డిసెంబర్ ఆఖరి వరకు వివాహాలకు, శుభకార్యాలకు సుమారు 30 మంచి ముహూర్తాలు ఉన్నాయని వారంటున్నారు. దీంతో భాజా భజంత్రీలు, మండపాలను అలంకరించే వారు, కేటరింగ్ నిర్వాహకులు, పురోహితులు, మేకప్, డెకొరేషన్ ఆర్టిస్టులు, ప్యాకరింగ్ క్యాబిల వారు, శుభలేఖల ప్రింటింగ్ ప్రెస్‌లు, ఫ్లెక్సీ ప్రింటర్స్, ఫోటోగ్రఫీ, టెంట్ హౌస్, వంట మేస్త్రీలు, వంట పనివారు, క్యాటరింగ్ బాయ్స్, బ్యూటిషన్లు, మెహందీ ఆర్టిస్టులు, పూలు అమ్మేవాళ్లు, మంగళ వాయిద్య కళాకారులు, డిజె మ్యూజిక్ నిర్వాహకులు.. ఇలా పెళ్లి వేడుకలతో ముడిపడిన ప్రతి ఒక్కరిలో ఆనందం వ్యక్తమవుతోంది. ముందుగానే ఎంపిక చేసుకొని, అడ్వాన్సులు ఇచ్చే పనుల్లో శుభ కార్యాలు నిర్వహించుకునే వారు నిమగ్నమయ్యారు. ఇప్పటి నుంచే సంప్రదింపులు చేస్తున్నారు. నగరంలో ఓ రేంజ్‌లో ఆర్డర్లు మొదలైనట్లు భోగట్టా. దసరాతో పాటు శుభకార్యాలకు అనువైన నెల కావడంతో నగరంలో పెద్దపెద్ద వస్త్ర దుకాణాలు, బంగారం దుకాణాల్లో అక్టోబర్‌లో అమ్మకాలు కూడా పెరిగాయని వ్యాపారాలు అంటున్నారు. ఇదే సమయంలో ఫంక్షన్ హాల్స్ బుకింగ్‌లు జోరందుకున్నాయి. పెద్ద పెద్ద కన్వెన్షన్ సెంటర్లు ఇప్పటికే బుక్ అయ్యాయి.

వివాహాల ముహూర్తాలు

పెళ్లిళ్ళు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు తదితర శుభకార్యాలకు ఈ నెల ఎంతో అనుకూలమైనదని రాష్ట్ర అర్చక సంఘం కన్వీనర్ శ్రీరంగం గోపి కృష్ణమాచార్యులు తెలిపారు. వివాహాల ముహూర్తాలు గురించి చెబుతూ... అక్టోబర్ 13, 16, 20, 27 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే నవంబర్‌లో 3, 7, 8, 9, 10, 13, 14, 16, 17 తేదీలు, డిసెంబర్‌లో 5, 6, 7, 8, 11, 12, 14, 15, 26 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నాయని తెలిపారు.

ప్రభుత్వ కల్యాణ మండపాలు కరువు

ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే కల్యాణ మండపాలు నగరంలో దాదాపు లేవు. జీవిఎంసికి చెందిన కల్యాణ మండపాలను ప్రైవేటు వ్యక్తులకు వేలం పద్ధతిలో అప్పగించారు. దీంతో ప్రైవేట్ వ్యక్తులు జీవిఎంసి నిర్దేశించిన అద్దె కాకుండా, తమకు నచ్చిన రీతిలో అద్దెను పెంచి ఇస్తున్నారు. ఇటువంటి కల్యాణ మండపాలను బుక్ చేసుకునే ముందు సంప్రదిస్తే, కల్యాణ మండపం అద్దెకు కావాలంటే, కల్యాణ మండపం అద్దె మాత్రమే కాకుండా వివాహానికి అవసరమైన డెకొరేషన్, భాజా భజంత్రీలు, లైటింగ్, భోజనాలు వగైరా వాటిని కూడా తామే సమకూరుస్తామని, వాటిని కూడా తమ వద్దనే బుక్ చేసుకోవాలని కండిషన్ పెడుతున్నారు. అలా ఇష్టపడేవారు వారి వద్ద అన్నీ బుక్ చేసుకుంటున్నారు. భరించలేని పేద, మధ్య తరగతి వారు కల్యాణ మండపాలకు దూరంగా ఉంటూ జీవిఎంసికి చెందిన రోడ్లపైన, సమీపంలోని కమ్యూనిటీ హాల్స్, పాఠశాలలు వగైరా వాటిలో వివాహాలు జరుపుకునే పరిస్థితి నెలకొంది.

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి

రాజ్యహింసే ఆయన మృతికి కారణం : ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రొఫెసర్ జిఎన్.సాయిబాబా అకాల మరణానికి కేంద్ర ప్రభుత్వ రాజ్య హింసే కారణమని పౌర, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపంగా ఆదివారం జీవిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రజా సంఘాల నాయకులు సాయిబాబా చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పౌర, ప్రజా సంఘాల నాయకులు, విశాఖ మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జెవి.సత్యనారాయణమూర్తి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, విరసం ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ బూసి వెంకటరావు, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు పి.వెంకట లక్ష్మి, ఎయు రిటైర్డ్ ఉద్యోగి ఏడుకొండలు, న్యాయవాది కెఎస్.చలం, అరసం నాయకులు ఎం.ఫైడిరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు మాట్లాడారు. సాయిబాబా ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విద్యార్థులకు పాఠాలను బోధిస్తూనే దేశంలో న్యాయమైన, నూతన సమాజం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. సాయిబాబా నిర్దోషిగా విడుదలైన కేసులో సుదీర్ఘ జైలు జీవితం అతని ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. 90 శాతం వికలాంగుడైనప్పటికీ అప్పీల్ పెండింగ్‌లో ఉన్న సమయంలో కూడా అతనికి రాజ్యం బెయిల్ ఇవ్వలేదన్నారు. నిజమైన పోరాట యోధుని స్ఫూర్తితో సాయిబాబా ఈ కష్టాలన్నింటినీ భరించాడన్నారు. గొప్ప విప్లవ ప్రజా మేధావి మరణంతో ప్రజలు నిజమైన స్నేహితుడిని, పోరాట యోధుడిని కోల్పోయారన్నారు. ఆయన మృతి పౌర ప్రజాస్వామిక ఉద్యమానికి తీరనిలోటు అన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎటువంటి ఆధారాలూ లేకుండా పదేళ్ళు నాగపూర్ జైల్‌లోని అండా సెల్‌లో పెట్టి క్రూరంగా కేంద్ర ప్రభుత్వం ఆయన్ని బాధపెట్టిందన్నారు. ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించి పోవడానికి మోడీ ప్రభుత్వం చేపట్టిన దుర్మార్గ పద్ధతులే కారణమన్నారు. జైల్‌లో ఉన్న కాలంలోనే తన తల్లి మరణించినా కనీసం కడచూపు కూడా చూడనివ్వకుండా ఫాసిస్టు ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. ఆయన పోరాట స్ఫూర్తితో అన్ని శక్తులు ఐక్యమై బిజెపి ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడి సారయ్య, రామ్ ప్రభు, ఎన్.నాగభూషణరావు, వామనమూర్తి, కూడా వజ్రం, వి.నల్లయ్య, ఎన్.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పిఆర్‌డి సంతాపం

సాయిబాబా మరణం వికలాంగ రంగానికి తీరని లోటని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) జిల్లా అధ్యక్షులు పాల వెంకయ్య తెలిపారు. సాయిబాబా మృతికి ఒక ప్రకటనలో ఆయన సంతాపం తెలిపారు. సాయిబాబా ఎంతో మంది వికలాంగులకు ఆదర్శప్రాయుడని కొనియాడారు.

NAME CHANGE

I, Sudhir Kumar Rai, a resident of Flat no X5, Nirman Heights Building, Nirman Park, Kancharpalem, Visakhapatnam-530008, have my father's name incorrectly spelt as **SATISH KUMAR RAI** in my **PASSPORT, M9634116.** The correct spelling is **SATEESH KUMAR RAI** and the same should be considered for all purposes.

CHANGE OF SPOUSE NAME

I, SUDHIR KUMAR RAI, Passport number M9634116, resident of Flat no X5, Nirman Heights building, Nirman Park, Kancharpalem, Vishakapatnam 530008, hereby certify that **SONALI SAXENA** is my legally wedded wife. Her **Passport number is R8796977.** The same should be considered for all purposes.

IN THE HON'BLE COURT OF THE IX ADDL. DISTRICT JUDGE cum M.A.C.T. AT: CHODAVARAM M.O.P. 841/2022

Between:
Muvvala Chinatalli & 3 others ...Petitioners
And:
Makireddi Sunendra & 2 others ...Respondents

NOTICE

To,
R-2:Vanthinibha Mahesh Kishore
S/o. Subba Rao, Hindu,
age not known but major,
R/at # 286, Gonduru Colony,
Chodavaram Village and Mandal,
Anakapalli District.

Please take notice that the above named petitioners herein has filed the above M.O.P. against you and other respondents for claiming compensation and the matter stands posted to **17-10-2024** for your appearance on that day at **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
B. RAMA GOPALA RAJU, CH. GEETHA,
Advocates
Narsipatnam,
Visakhapatnam Dist

నిలిచిన నేత్ర వైద్య సేవలు

- గుత్తేదారు సంస్థతో ముగిసిన ఒప్పందం
- పునరుద్ధరించాలంటున్న రోగులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్‌సి)లో 'ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం' ద్వారా ఆధునిక వైద్య పరికరాలతో గత కొంత కాలంగా అందిస్తూ వస్తున్న ఉచిత నేత్ర వైద్య పరీక్షలు గత నెల 16వ తేదీ నుంచి తాత్కాలికంగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వం గుత్తేదారు సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం గడువు ముగియడంతో సేవలు అనివార్యంగా నిలిచిపోయాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రితో పాటు భీమిలి, పెందుర్తి, చోడవరం, కె.కోటపాడు, యలమంచిలి, నక్కపల్లి, పాడేరు, అరుకు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో 'ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రాల ద్వారా 2018 ఫిబ్రవరి 1న అప్పటి టిడిపి ప్రభుత్వ హయంలో ఉచిత నేత్ర వైద్య సేవలు ప్రారంభమైన విషయం విదితమే. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కొనసాగించింది. వైసిపి ప్రభుత్వం గుత్తేదారు సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం గడువు ముగియడంతో ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలో నేత్ర వైద్య సేవలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది.

ఆధునిక వైద్య పరికరాలతో ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు చేసి కంటి అద్దాలను సంబంధిత రోగులకు అందించే వారు. అవసరం అనుకుంటే నగరంలోని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రికి రిఫర్ చేసేవారు. సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలకు 'ఆప్తమాలజీ' సేవలు అందుబాటులో ఉండేవి. ఇందుకోసం గుత్తేదారు సంస్థచే నియమితులైన ఇద్దరు ఆప్తామిక్ అసిస్టెంట్లు ప్రస్తుతం ఇక్కడ విధుల్లో లేరు. కంటి పాప సామర్థ్యాన్ని తెలుసుకునే ఆటో రిఫ్రాక్టో మీటర్, కుర్చీలు, ఇతర వైద్య పరికరాలను సైతం గుత్తేదారు సంస్థ సిబ్బంది తీసుకెళ్లిపోయారు.

గత వైసిపి ప్రభుత్వ కాలంలో 2019 నవంబర్‌లో 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు 'కంటి వెలుగు' పథకం కింద నేత్ర వైద్య పరీక్షలు చేశారు. గ్రామాల్లో 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు చేశారు. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించలేదు. సిహెచ్‌సిలో ఉన్న ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం సిబ్బందితోనే పరీక్షలు చేయించేవారు. అనివార్యంగా ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రానికి రోగుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కంటి వెలుగు పథకం మూడేళ్ల పాటు కొనసాగింది.

రోజుకు 25 నుంచి 30 మందికి సేవలు..

ఇక్కడి 'ముఖ్య మంత్రి ఈ ఐ కేంద్రం' ద్వారా రోజుకు 25 నుంచి 30 మందికి సిబ్బంది సేవలు అందించేవారు. ముందుగా కంప్యూటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆధార్ కార్డు నంబర్ తో పాటు రోగి వివరాలు నమోదు చేసేవారు. అనంతరం ఆటో రిఫ్రాక్టో మీటర్‌పై కంటి పాప సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. ఫండస్ కెమెరా ద్వారా మధుమేహం, రక్తపోటు, గ్లకోమా ఉన్న వారిలో దృష్టి లోపం, రెటీనా పనితీరు గుర్తిస్తారు.

'ముఖ్యమంత్రి ఈ ఐ ఆరోగ్య కేంద్రం ద్వారా ఎప్పటివలెనే సేవలు కొనసాగించాలని నేత్ర వైద్య సంబంధిత రోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రోడ్లపై వ్యాపారాలతో నిలిచిపోతున్న వాహనాలు

రోడ్లపైనే వ్యాపారాలు

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం కూడలిలో నిత్యం రద్దీగా ఉండే రోడ్లపైన వ్యాపారాలు సాగిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం, పెందుర్తి నుంచి విజయనగరం వెళ్లే వాహనాలు, ఆనందపురం పూల మార్కెట్ నుంచి వచ్చే వాహనాలు, బిపికల్లాల నుండి వేములవలస వచ్చే వాహనాలు ఆనందపురం కూడలి మీదుగా ప్రయాణిస్తాయి. ఆనందపురం కూడలి రోడ్లపైనే పూల అమ్మకాలు సాగిస్తున్నారు. సాగిస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ కూడలిలో వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు వాహనదారులతో కిక్కిరిసిపోతుంది. వాహనదారులు రోడ్లపైనే వాహనాలు ఆపి పువ్వులు తదితర వస్తువులను కొనుగోలు చేయడంతో మరింత ఇబ్బందికరంగా మారుతోంది. రోడ్లపైన వ్యాపారాలను నివారించి ప్రమాదాలు జరగకముందే సరైన చర్యలు చేపట్టాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు

అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం ఆర్.తాళ్లవలస పంచాయతీ గొల్లల తాళ్లవలసలో ఈ నెల 14వ తేదీన ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం కింద చేపట్టనున్న రోడ్లు, కాల్వల నిర్మాణ పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేయనున్నట్లు స్థానిక గంటా క్యాంప్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

అర్జీలు స్వీకరించనున్న గంటా..

స్థానిక ఎండిఓ కార్యాలయంలో సోమవారం జరుగు పిజిఆర్‌ఎస్‌కు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు ఎండిఓ ఎన్.హనుమంత రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక 11 కెవి పాలిటెక్నిక్ కళాశాల ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 14, 15 తేదీల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ జోన్ 3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జివిఎంసి 3, 4 వార్డుల పరిధిలోని నేరెళ్లవలస, ఎగువపేట, బోయివీధి, ఎస్‌ఒఎస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గీతం దూర విద్య కోర్సుల్లో అడ్మిషన్లు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఒఇ) ఆధ్వర్యాన దూర విద్యా విధానంలో ఎమ్‌ఎ ఇంగ్లీష్, బిఎ, బికామ్ డిగ్రీ కోర్సుల్లో 2024 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఒఇ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటి నుంచి దూర విద్యా విధానంలో ఈ కోర్సులను అభ్యసించేలా ఏర్పాట్లుచేసినట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ 15వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం cdl@gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా సూచించారు.

బోనిలో అపారిశుధ్యం

అధ్వానంగా మరుగుదొడ్లు

అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బోని గ్రామ పంచాయతీలో అపారిశుధ్యం నెలకొంది. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం నీరు ఎక్కడికక్కడే నిల్వచేరింది. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోని కల్యాణమండపం వెనుకనున్న మరుగుదొడ్లు నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. పంచాయతీ పరిధిలోని రామునేనిపేట, ఎస్సీ కాలనీ, బోనివీధిలో మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ చేరి దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. గత ఏడేళ్ల క్రితం బోని గ్రామం స్వచ్ఛభారత్ పనులలో ఆదర్శ గ్రామంగా నిలిచి జాతీయస్థాయిలోనే బహుమతి గెలుచుకుంది. అటువంటి గ్రామంలో ప్రస్తుతం అపారిశుధ్యం నెలకొనడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కాలంలో వ్యాధులు ఎక్కువగా సంక్రమించే అవకాశం ఉన్నందున నీటి నిల్వ లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంచాయతీలో చేరిన మురుగు నీరు

నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస సత్య కల్యాణ్ అపార్ట్‌మెంట్‌లో భరతనాట్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు విజయనగరం పైడితల్లమ్మ ఉత్సవాలలో నృత్య ప్రదర్శనలిచ్చి ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆనంద గజపతి ఆడిటోరియంలో శ్రీ ప్రసన్న నృత్య కళా నికేతన్ విజయనగరం, ఆనందపురం విద్యార్థుల నృత్య ప్రదర్శన ప్రేక్షకులకు కనువిందు చేసినట్లు భరతనాట్యం గురువు ఇబ్రహీంఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన కోలాటం పోటీలు

సీనియర్ విభాగంలో చిప్పాడ, జూనియర్ విభాగంలో పాండ్రంగి విజేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గంటా నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యాన గత కొద్ది రోజులుగా భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఉత్సాహంగా జరిగిన కోలాటం తుది పోటీలు శనివారం సాయంత్రం స్థానిక ఎండిఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఆద్యంతమూ గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టి పడేలా తుది పోటీలు ఉత్సాహ పూరితంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కోలాటం ప్రదర్శనలను తిలకించారు. న్యాయనిర్ణేతలు పొట్నూరు మురళీ మోహనరావు (చిట్టివలస జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు), మేరుగు బాబూరావు (విశ్రాంత ఉపాధ్యాయులు), దోకర సత్యనారాయణ (యోగా టీచర్, గణిత ఉపాధ్యాయులు) నియోజకవర్గ స్థాయి కోలాటం పోటీల్లో విజేతను ప్రకటించారు. సీనియర్ విభాగంలో భీమిలి మండలం చిప్పాడ మొదటి బహుమతి గెలుచుకుంది. రెండు, మూడు బహుమతులు వరుసగా పద్మనాభం మండలం గెద్దపేట, ఆనందపురం మండలం ముచ్చర్ల జట్లు విజేతలుగా నిలిచాయి. జూనియర్ విభాగంలో వరుసగా మొదటి, రెండు, మూడు బహుమతులు పద్మనాభం మండలం పాండ్రంగి, భీమిలి మండలం యాతకుమ్మరిపాలెం, ఆనందపురం మండలం చందక గ్రామాల జట్లు నిలిచాయి. ఆనందపురం మండలం గొట్టిపల్లి జట్టుకు ప్రోత్సాహక బహుమతి లభించింది.

ఆయా జట్లకు వరుసగా రూ.50,116, రూ.25,116, రూ.15,116, రూ.10,116 ను ఎమ్మెల్యే గంటా, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా అందించారు. నగదు బహుమతులతోపాటు ట్రోఫీలు అందజేశారు.

డిసెంబర్ 1న 'భీమిలి ఉత్సవ్'

డిసెంబర్ 1న 'భీమిలి ఉత్సవ్' నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. కోలాటం పోటీల విజేతలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, కోలాటం పోటీల్లో పాల్గొని ప్రదర్శనలు ఇచ్చిన 60 బృందాలను అభినందించారు. గెలుపు, ఓటములను ఒకేలా స్వీకరించాలని సూచించారు. డిసెంబర్ 1 న నిర్వహించే భీమిలి ఉత్సవ్ వేదికగా కోలాటం పోటీలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇదే తరహాలో కోలాటం పోటీలు తన నియోజకవర్గమైన గాజువాకలో త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. ఇన్చార్జి ఎండిఓ కనకల రమేష్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు కార్యక్రమంలో స్థానిక ఆర్‌డిఓ కె.సంగీత్‌మాధుర్, టిడిపి యువ నేత గంటా రవితేజ, జెడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, వివిధ విభాగాల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కోలాటం పోటీల ముగింపు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విజేతలకు బహుమతులు అందిస్తున్న బిఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి -మాధవధార : దసరా సందర్భంగా బిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన కంచరపాలెంలోని బిఎన్ఆర్ భవనంలో చిత్రలేఖన, ఉపన్యాస, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. చిత్రలేఖన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశాఖ చిత్రకళా పరిషత్ అధ్యక్షులు సుంకర చలపతిరావు, కార్యదర్శి డి.మనోహర్ వ్యవహరించారు. ఉపన్యాస, పాటల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా రాజేష్, రామారావు వ్యవహరించారు. చిత్రకళ ప్రాముఖ్యత గురించి చిత్రకళా పరిషత్ అధ్యక్షులు సుంకర చలపతిరావు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. బిఎన్ఆర్ ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమాల గురించి ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణారావు మాస్టారు వివరించారు. మూడు కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమాలను బిఎన్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు రామారావు, రమణబాబు, బుజ్జి, రాజేష్, కావ్య, కృష్ణారావు మాస్టారు, త్రినాధ స్వామి, సుధాకర్ నిర్వహించారు.

పిసిసి స్పోర్ట్స్ చైర్మన్‌గా జివిఎస్ కమలాకర్‌రావు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాంగ్రెస్ కమిటీ స్పోర్ట్స్ చైర్మన్‌గా జాతీయ క్రీడాకారుడు జివివిఎస్. కమలాకర్ రావును నియమిస్తూ పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమలాకర్‌రావు మాట్లాడుతూ, షర్మిల తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. రాష్ట్రంలో ఉన్న క్రీడాకారులకు, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా కృషిచేస్తానని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న పేద క్రీడాకారులకు ఎటువంటి ప్రోత్సాహం కావాలన్నా, తను సాయం చేయటానికి సిద్ధంగా ఉంటానని తెలిపారు.

ఈశ్వరరావుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెందుర్తి: గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ జర్నలిస్ట్ గరికిన ఈశ్వరరావుకు సిపిఐ నాయకులు ఆపన్న హస్తమందించారు. జర్నలిస్టు సంఘాల ద్వారా ఈశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వై.రాంబాబు అతని ఇంటికి వెళ్లి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను నిరంతరం వెలికితీసే జర్నలిస్టులు తరచూ అనారోగ్యం పాలవడం బాధాకరమని, వారికోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా అంతంతమాత్రంగా ఉండే పాత్రికేయులకు గౌరవ వేతనం, పెన్షన్ వంటి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించే జర్నలిస్టుల పట్ల గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. కాగా ఈశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై వివరాలడిగి తెలుసుకున్న సిపిఐ నాయకులు తాము తోడుగా ఉన్నామని అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. పది రోజుల్లో ఆపరేషన్ చేయడానికి సిద్ధం చేశారని, ఆపరేషన్‌కు సుమారు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని ఈశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు సహాయ సహకారాలు అందించిన జర్నలిస్ట్ సోదరులకు, రాజకీయ, ప్రజా సంఘాల నేతలకు, అధికారులకు అతను ధన్యవాదాలు తెలిపారు. ఈశ్వర్‌కు ఆర్థిక సహాయం అందించాలనుకున్నవారు ఆయన తమ్ముడు గరికిన రాజు 98858 53547 ఫోన్ పే నెంబరుకు సాయం చేయవలసిందిగా జర్నలిస్టు సంఘాల నాయకులు వాల్మీకి నాగరాజు, దాది వెంకట్ కోరారు.

అధ్వానంగా ఆటోనగర్ రహదారులు

పట్టించుకోని అధికారులు

గోతుల్లో నిండిన వర్షపు నీరు

ప్రజాశక్తి -గాజువాక : నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది కార్మికులు తిరిగే గాజువాక ఆటోనగర్‌లో రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లన్నీ గోతులమయమయ్యాయి. గాజువాక ఆటోనగర్‌లో 900 పరిశ్రమ యూనిట్లు నడుస్తున్నాయి. 11 వేల మంది కార్మికుల పనిచేస్తున్నారు. గాజువాక ఆటోనగర్ ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్ బ్లాక్‌లుగా విభజించారు. ఆటోనగర్‌లో ఉన్న రహదారులను ఎన్నో ఏళ్లుగా మరమ్మతు చేయక, కొత్తగా రోడ్లు వేయకపోవడంతో పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. ఈ మధ్య కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిల్వ నీటిలో దోమలు, ఈగలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనికి తోడు వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో విధులు ముగించుకొని ఇంటికి వెళ్లే కార్మికులు గోతుల్లో పడి తీవ్ర గాయాలు పాలవుతున్నారు. గత కొన్ని నెలలుగా తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. బ, ా రీ వాహనాలు గోతుల్లో పడి విలువైన పరికరాలు పాడైపోతున్నాయి. దీంతో చిన్న పరిశ్రమ యజమానులకు అదనపు భారం పడుతుంది. సకాలంలో ఆస్తి పనులు చెల్లిస్తున్నప్పటికీ, కనీస సౌకర్యాలైన రహదారులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై పరిశ్రమల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఐలా పాలకవర్గం కూడా వీటిపై స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. ప్రస్తుత ఐలా కమిషనర్ బదిలీ కావడంతో, పాలకవర్గం తరపున ఐలా చైర్మన్ సత్యనారాయణ రెడ్డిని దీనిపై వివరణ కోరగా, త్వరలో రహదారులన్నీ అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇప్పటికే రహదారులు ఎస్టిమేషన్ వేశామని పేర్కొన్నారు.

రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు

చెడు కార్యాలకు దూరంగా ఉండాలి

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజలు చెడు వ్యసనాలకు, చెడు కార్యాలకు దూరంగా ఉండాలని దసరా సందర్భంగా అందరూ ఈ ప్రతిజ్ఞ చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. దసరా సందర్భంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బ్రహ్మకుమారిస్ ఈశ్వరీయ విద్యాలయం ఆధ్వర్యాన శనివారం సాయంత్రం రావణ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, చెడుపై మంచి విజయం సాధించిన రోజు దసరా అన్నారు. అటువంటి చెడు లేకుండా నగరంలో అందరూ బాధ్యతగా ఉండాలని కోరారు. సమాజ హితం, పొరుగు వారి హితం కోరే విధంగా అందరూ మసలుకోవాలని చెప్పారు. చెడు కార్యక్రమాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం 10 తలల రావణబ్రహ్మ బొమ్మకు ఆయన నిప్పుపెట్టారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ ప్రతినిధి రమాదేవి పాల్గొన్నారు.

చౌదరి అప్పారావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- మాధవధార : ప్రముఖ కళాకారులు, పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు 87వ జన్మదిన వేడుకలు మాధవధారలోని ఆయన నివాసంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సనపల బంగార్రాజు, కళాకారులు ప్రసాద్, అర్కిక శ్రీనివాసం ఆధ్వర్యాన నిర్వహించారు. అప్పారావును శాలువతో సత్కరించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కళా రంగంలో అత్యంత ఆదరణ కలిగిన వ్యక్తి చౌదరి అప్పారావు మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అవార్డుతో మరింత బాధ్యత

బొడ్డేటి కాశీ విశ్వనాథం

విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ అధినేత బొడ్డేటి కాశీ విశ్వనాథం

ప్రజాశక్తి- సీతమ్మధార : విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌కు రాష్ట్ర పర్యాటక అభాగ్య ప్రధాన అవార్డు రావడం మరింత బాధ్యత పెరిగిందని, రానున్న రోజుల్లో మరింత పర్యాటకంగా స్పోర్ట్స్ క్లబ్‌ను ముందుకు తీసుకెళ్లేలా కృషి చేయనున్నట్లు క్లబ్ అధినేత బొడ్డేటి కాశీవిశ్వనాథం తెలిపారు. తనను కలిసిన ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ, పోర్టు స్టేడియంలోనివిశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో చిన్న పిల్లల నుంచి పెద్ద పిల్లల వరకు ఎన్నో ఆటలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో మొదటిసారి సుమారు 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అతిపెద్ద స్నో వరల్డ్, 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో విభిన్నమైన స్లైడ్స్‌తో వాటర్ పార్క్, 15 వేల అడుగుల విస్తీర్ణంలో ఫన్‌జోన్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు పిల్లలు, పెద్దలు అన్ని వయసుల వారు ఇక్కడకు వచ్చి త్రిల్లింగ్ పొందుతారని వివరించారు. విశాలమైన రెస్టారెంట్లో ఫుడ్ జోన్, అత్యాధునిక జిమ్ అందుబాటులో ఉందని తెలిపారు. నేటితరం యూత్ కోరుకునే త్రిల్లింగ్ అండ్ అడ్వెంచర్ అమేజ్‌మెంట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఒకచోటే 19 రకాల ఫన్ గేమ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్విమ్మింగ్ పూల్, 12డి థియేటర్, లేజర్ వార్స్, 360 డిగ్రీస్ సైక్లింగ్, బంగి జంప్, రాకెట్, కిడ్స్ ఫోటో స్టూడియో, స్టాప్ ప్లే ఏరియా, డాషింగ్ కార్స్, ఆర్‌కెడి గేమ్స్, లైవ్ యాక్షన్ క్రికెట్ తదితర రకాల గేమ్స్ ఒకచోటే ఉంటాయని వివరించారు.

క్రికెట్ బాక్స్, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్, త్రోబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, కరాటే, తైక్వాండో ఆడేందుకు పోర్టు స్టేడియంలో అన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ, ఒకేసారి 160 మంది కూర్చున్న విధంగా ఏసీ రెస్టారెంట్ అందుబాటులో ఉన్నాయని, 1500 సిట్టింగ్‌తో కళావని ఆడిటోరియం ఆధునికరించినట్లు పేర్కొన్నారు. సుమారు 50 వేల మంది కెపాసిటీతో విశ్వనాథ్ కన్వెన్షన్ సెంటర్‌ను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

ఐఐపిఇలో ఫిట్ ఇండియా ఫ్రీడం రన్

ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ ప్రారంభోత్సవంలో పెట్రో వర్సిటీ రిజిస్ట్రార్ రాంపాల్

ప్రజాశక్తి.-సబ్బవరం :కేంద్ర పెట్రోలియంశాఖ ఉత్తర్వులు మేరకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జి (ఐఐపిఇ) లో "ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0'ను ఇనిస్టిట్యూట్ రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేది, ప్రత్యేక అతిథులు దోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వేంకటేశ్వర రావు, ఒలింపియన్ మాణిక్యాల రావు, ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ నోడల్ అధికారి డాక్టర్. రంధి రామూనాయుడు ప్రారంభించారు ఫిట్‌నెస్, స్వచ్ఛతపై అవగాహన కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల రోజులు పాటు స్థానిక బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం నిర్వహణకు సహకరించిన వారికి ఐఐపిఇ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ ,రిజిస్ట్రార్ రాంపాల్ దివేది కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రోగ్రాం షెడ్యూల్‌ను వివరించారు. ఈ సందర్భంగా రాంపాల్ ద్వివేది మాట్లాడుతూ ప్రతివిద్యార్థికి జీవితంలో ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో తెలియపరచడమే లక్ష్యంగా 'ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0' కార్యక్రమాన్ని ప్రధాని మోడీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.కమిటీ సభ్యులకు బెస్టాఫ్ లక్ చెప్పారు.. ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఐఐపిఇలో ఇలాంటి మంచి కార్యక్రమం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఒలింపియన్ మాణిక్యాలరావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ ఏదో ఒక క్రీడను ఎంచుకొని దానిని క్రమం తప్పకుండా ప్రతిరోజూ సాధన చేయాలన్నారు. ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలన్నారు. కమిటీ సభ్యులు డాక్టర్ సిహెచ్ గుప్తా చందలూరి విద్యార్థులతో ఫ్రెండ్స్ ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0 ప్రతిజ్ఞ చేయించారు. నోడల్ అధికారి డాక్టర్ రంధి రాముానాయుడు, అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ గుప్తా చందలూరి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి మురళీకృష్ణ, కమిటీ సభ్యులు ,విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ

ఆయుధపూజ చేస్తున్న ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-అనకాపల్లి పండుగను పురస్కరించుకొని ఎస్పీ దీపిక ఆయుధాలు, వాహనాలకు ఘనంగా పూజ నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు నిత్యం వాడే ఆయుధాలు, వాహనాలకు కైలాసగిరి, ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా ఎస్‌పి కుమారుడు మాస్టర్ తవిష్ తో కలిసి పాల్గొని దుర్గామాత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు, సిబ్బంది, ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, వి.సత్తిరాజు, ఎ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్స్పెక్టర్లు బాలసూర్యా రావు, సతీష్, మన్మధరావు, నరసింహమూర్తి, ఎస్సైలు నాయుడు, ఆదినారాయణ ఇతర అధికారులు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న నానాజీ

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండలంలోని రైవాడ గ్రామంలో విశాఖ డెయిరీకి పాలు పోసే పాడిరైతులకు డెయిరీ ద్వారా అందజేసే దుప్పట్లను ఆదివారం అనకాపల్లి పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు చల్లా నానాజీ పంపిణీ చేశారు డెయిరీ రైతులకు ప్రతి ఏటా బోనసులతో పాటు, ప్రోత్సాహకాలను అందించడం ఆనందంగా ఉందని పాడి రైతులు అన్నారు. కార్యక్రమంలో పాల కేంద్రం ప్రెసిడెంట్ శీర రమణ, దుక్క ఈశ్వరరావు, చల్లా గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవర చిత్ర విలన్ తారక్ పొన్నప్పకు సత్కారం

దేవర విలన్ పశురాను సత్కరిస్తున్న నందమూరి అభిమానులు

ప్రజాశక్తి- అనకాపల్లి : జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర చిత్రంలో విలన్ పాత్రధారి పశురాను జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఘనంగా సత్కరించారు. దసరా ఉత్సవాల సందర్భంగా అనకాపల్లి విచ్చేసిన ఆయనను ఆదివారం పట్టణంలోని ప్రైవేట్ రెస్టారెంట్లో అనకాపల్లి నందమూరి బాలకృష్ణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు మళ్ళ సంతోష్, అభిమానులు మర్యాదపూర్వకంగా కలుసుకొని నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మళ్ళ సంతోష్, తారక్ పొన్నప్ప (పశురా)తో మాట్లాడుతూ తాము ఎంతగానో అభిమానించే హీరో జూనియర్ ఎన్టీఆర్ దేవర చిత్రంలో ప్రత్యేక పాత్రలో నటించడం ఆనందంగా ఉందన్నారు. దేవర 2 చిత్రంలో కూడా ప్రత్యేక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించారు. అనకాపల్లికి చెందిన సెన్సేషనల్ డైరెక్టర్ నక్కిన త్రినాధరావు దర్శకత్వంలో అనకాపల్లి పరిసర ప్రాంతాలలో చిత్రీకరణ జరుపుకోనున్న అనకాపల్లి చిత్రంలోనూ తాను నటించనున్నట్లు వెల్లడించారు. దసరా ఉత్సవాలరో అనకాపల్లి రావడం సంతోషకరమన్నారు. దేవర చిత్రం ఘనవిజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మద్దాల భీమేష్, బొడ్డెడ గిరీష్, సాయి, ప్రదీప్, మల్లిక్, సాయి, గణేష్, కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన డిపిఎల్ క్రికెట్ టోర్నీ

విజేతలతో మాజీ ఎంపిపి కిలపర్తి

ప్రజాశక్తి-దేవరాపల్లి: దేవరాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక యువకులంతా ఆటవిడుపుగా ఏర్పాటు చేసుకున్న దేవరాపల్లి క్రికెట్ లీగ్ (డీపీఎల్)లో 6 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో బాలు రైడర్స్ టీం ప్రథమ స్థానం కైవసం చేసుకోగా..ట్రోఫీతో పాటు రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు. రెండవ బహుమతి రూ. 5 వేలను వాసు రైటర్ టీం గెలుపొందారు. ఈ టోర్నమెంట్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన దేవరాపల్లి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, డిపిఎల్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, సబ్బవరపు మాలిబాబు, గవిరెడ్డి దేముడునాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు వస్తు వితరణ

భవన నిర్మాణ కార్మికులకు వస్తు వితరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి రావలమ్మ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు కన్నూరు సూర్యనారాయణ చొరవ స్ఫూర్తిదాయకమని స్థానిక ఎస్ఐ ఆర్.ధనుంజయ్ అన్నారు. దసరా పండగ సందర్భంగా ఏటా మాదిరిగానే తనతో పనిచేస్తున్న సుమారు 80 మంది కార్మికులకు కన్నూరు సూర్యనారాయణ తన సొంత డబ్బులు రూ.మూడు లక్షలతో గృహోపకరణాలు, పాత్రలు, దుస్తులు, ఆహార దినుసులు పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తోటికార్మికులకు పండుగ సందర్భంగా ఎంతో కొంత సాయం చేయాలన్న ఆలోచన అభినందనీయమన్నారు.కార్మికులకు ఏటా వస్తు వితరణ చేస్తున్న సూర్యనారాయణను ప్రశంసించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, సత్యసాయి భజన మండళ్ల మండల కన్వీనర్ కన్నూరు అప్పలనాయుడు మాట్లాడుతూ 20 ఏళ్లగా సూర్యనారాయణ తన తోటి కార్మికుల సంక్షేమం, భద్రతకు కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బోని వెంకటరావు, బండారు ఈశ్వరరావు, కశిరెడ్డి అప్పారావు, బండారు ఎర్రిబాబు, కశిరెడ్డి అప్పారావు, కల్లెంపూడి దేముడుబాబు, కొండ్రపు శ్రీను, చుక్క దేముళ్ళు, గోగాడ దేముళ్ళు, చుక్క పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలతో వ్యాధులు దూరం

మాట్లాడుతున్న సత్యనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : తగిన ఆరోగ్య నియమాలను పాటించడం ద్వారా పలు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ అడిషనల్ సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ బెల్లం మార్కెట్లో అనకాపల్లి వాకర్స్ క్లబ్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. పూర్వ ఎవిపి డాక్టర్ డిడి నాయుడు పరిచయ కార్యక్రమంతో ప్రారంభమైన సభలో ముఖ్య అతిథి సత్యనాథం మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ విశిష్టత, నియమ నిబంధనలు వివరించారు. రోగాలు, ఆరోగ్య పరిరక్షణ అంశాలను తెలియజేశారు. నీరు ఎక్కువగా తాగాలని, ప్రతి రోజూ నడక, వ్యాయామం, యోగా, ప్రాణాయామం అభ్యాసం చేయాలన్నారు. వ్యాయామాన్ని నిజ జీవితంలో ఒక భాగం చేసుకోవాలని, తద్వారా డాక్టర్స్ అవసరం ఉండదన్నారు. మన శరీరాన్ని మనమే రక్షించుకోవాలని, అది లేనినాడు జీవనం వ్యర్థమన్నారు. సత్యం, ధర్మం, అహింస పాటించాలని, అధిక ఆలోచన చేయడం వలన మానసిక ఆందోళన కలిగి ఆరోగ్యం చెడిపోతుందని వివరించారు. . సంతులిత ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం సత్యనాధాన్ని వాకర్స్ కమిటీ సభ్యులు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.

పీలాకు ఘన సత్కారం

పీలాను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -అనకాపల్లి : విజయదశమి పురస్కరించుకొని అనకాపల్లి పట్టణం, గవరపాలెం పార్క్ సెంటర్ వద్ద, వేల్పుల వీధి రజకుల కాలనీలో, అనకాపల్లి మండలంలో పలు గ్రామాలు, కశింకోట మండలం దుర్గా దేవి ఆలయం, నర్సింగబిల్లి గ్రామంలో రాజరాజేశ్వరి అవతారంలో దర్శనం ఇస్తున్న దుర్గాదేవి అమ్మవార్లను రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు మల్ల సురేంద్ర, పోలవరపు త్రినాద్, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. దసరా సందర్భంగా పట్టణంలో భారీ ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేశారు.

తాతయ్యబాబుకు అభినందన

ప్రజాశక్తి- వడ్డాది : రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బత్తుల తాతయ్యబాబుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వడ్దాదిలోని ఆయన క్యాంపు కార్యాలయం సందర్శకులు రాకతో సందడి నెలకొంది. విజయదశమి సందర్భంగా శనివారం పలు గ్రామాల నుంచి అభిమానులు, కూటమి పార్టీల నాయకులు వచ్చి అభినందనలు తెలిపారు.శాలువతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా తాతయ్యబాబు ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు



తాతయ్యబాబును అభినందిస్తున్న కూటమి నేతలు

మద్యం దరఖాస్తుదారుల్లో టెన్షన్!

- నేడు డ్రా ద్వారా దుకాణాల కేటాయింపు
- జాక్‌పాట్ ఎవరికి వరిస్తుందోనని ఉత్కంఠ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకున్న వారిలో టెన్షన్ నెలకొంది. మద్యం దుకాణాలకు రూ.రెండు లక్షలు చొప్పున నాన్‌రిఫండబుల్ ధరావత్తు చెల్లించి దరఖాస్తులు దాఖలు చేసుకున్న నేపథ్యంలో లాటరీలో దుకాణం వస్తే వారి ఆనందానికి అవధులుండవు. అదే సమయంలో లాటరీలో జాక్‌పాట్ దక్కని పరిస్థితుల్లో డిపాజిట్‌గా చెల్లించిన రూ.రెండు లక్షలు కోల్పోవాల్సిందే. మండలంలో గతంలో 12 మద్యం దుకాణాలు ఉండగా, వాటిలో ఎస్ఇజెడ్ కాలనీలోని మూడు షాపులను తొలగించారు. మిగిలిన 9 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించగా,180 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో ఒకే వ్యక్తి తన సిండికేట్ ద్వారా 60 దరఖాస్తులు చేశారని తెలుస్తోంది.. సోమవారం ఉదయం 7:30 గంటలకు టెండర్లు ఓపెన్ చేయనున్నారు. లాటరీలో ఎవరికి షాపు వస్తుందోనని దరఖాస్తుదారుల్లో టెన్షన్ మొదలైంది. 60 షాపులకు టెండర్లు వేసిన వ్యక్తి దరఖాస్తు పీజు రూపంలో 60 దుకాణాలకు రూ. కోటి 20 లక్షలను చెల్లించారు.లాటరీలో దుకాణం దక్కకుంటే ఆ మొత్తం కోల్పోయినట్లే.

అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక, అనకాపల్లి మండలాల్లో షాపులకు దరఖాస్తు చేశారు. వాటిల్లో కొన్ని షాపులైనా లాటరీలో తమకు దక్కుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 16 నుంచి ప్రయివేటు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారంతా ఇప్పటికే దుకాణాల ఏర్పాటుకు వసతి అన్వేషణలో పడ్డారు. ఇప్పటికే ఉన్న దుకాణాల్లోనే కొత్త మద్యం దుకాణాలను పెట్టాలని కొందరు భావిస్తుండగా, మరికొందరైతే తమకు లాటరీలో మద్యం దుకాణం దక్కితే, కొత్తగా వేరు చోట పెట్టాలని భావిస్తున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ సమక్షంలో మద్యం దుకాణాలను డ్రా తీయనున్న నేపథ్యంలో ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. మరోవైపు, కొత్త మద్యం పాలసీలో మద్యం ధరలు తగ్గుతాయని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, ధరలు ఎలా ఉంటాయోయనని ఇప్పటికే మద్యం ప్రియులు లొట్టలు వేస్తున్నారు.

'పల్లె పండగ'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులను పల్లె పండుగలో భాగంగా ఈ నెల 16 నుంచి పండగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వి విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని వివిధ పంచాయతీల్లో పల్లె పండుగ షెడ్యూల్‌ను వివరించారు. ఈ నెల 16వ తేదీన కొమల్లపూడి, ఎల్‌బిపి అగ్రహారం, దిబిడి, బుచ్చయ్యపేట, పెద్దమదిన, చిన మదిన, కరక, సీతయ్యపేట,పెదపూడి,,పి పి అగ్రహారం, 17న చిన్నప్పన్నపాలెం, ఐతంపూడి, కందిపూడి,కే పి అగ్రహారం, కొండపాలెం, గున్నెంపూడి, నీలకంఠాపురం, రాజాం, ఆర్ భీమవరం, ఆర్ శివరాంపురం, 18న మల్లం, తెపురం, చిట్టియ్యపాలెం, తురకలపూడి, చింతపాక, మంగళాపురం విజయరామరాజుపేట, వడ్డాది, లోపూడి, ఎల్ సింగవరం,19న పొట్టిదొరపాలెం, గంటికొర్లం కొండంపూడి, పోలేపల్లి, పి భీమవరం గ్రామాల్లో పల్లెపండుగలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు.

నాతవరం: మండలంలో ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు చేపట్టే పల్లె పండుగ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలుగుదేశంపార్టీ మండలం అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అనకాపల్లి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ, మండలంలో 56 అభివృద్ధి పనులకు సుమారుగా 2.91కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొంటారని, ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిపీలు పారుపల్లి కొండబాబు, సింగంపల్లి సన్యాసిదేముడు, నేతల విజయ్ కుమార్, మాజీ ఎంపిటీసీ అపిరెడ్డి మాణిక్యం, మాజీ బ్యాంకు అధ్యక్షుడు శెట్టి సత్యనారాయణ, మండల ఐ.టిడిపి ఇన్ ఛార్జ్ శెట్టి గోపి, తెలుగు యువత అధ్యక్షులు శెట్టి లోవ,రైతు అధ్యక్షులు పైల సూరిబాబు, చింతకాయల శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా పశువుల పండగ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో ఆదివారం పశువుల మ్మ పండగను గ్రామ ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాది ఇదే నెలలో రైతులు ఈ పండగను ఆనవాయితీగా జరుపుకుంటారు.పశువులమ్మను భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా పశుసంపద వృద్ధి చెందడంతోపాటు వ్యాధులు రాకుండా ఆరోగ్యవంతంగా ఉంటాయని భక్తుల నమ్మకం. గ్రామంలోని పశువులన్నింటినీ ఒక చోటకు చేర్చి, డప్పులు, మేళతాళాలలతో వాటిచుట్టూ మూడుసార్లు ప్రదర్శన చేసి, వాటిపై అక్షింతలు, పసుపునీళ్లు చల్లుతారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడు. గ్రామ పెద్దలు రాజి శ్రీనివాసరావు, సుందరపు గంగాధర్, తనకల పట్టాలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

మంటలు చెలరేగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలం తాళ్లపాలెం సంత వద్ద ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తరచూ మంటలు చెలరేగుతుంటాయని స్థానిక యువకులు తెలిపారు. తాళ్లపాలెం, నర్సీపట్నం రోడ్డులో ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో, మంటలు చెలరేగే సమయంలో అటూఇటూగా పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ ఘటనతో 50 ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి, అంధకారంలో గడపాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యను ఇప్పటికైనా పరిష్కరించాలని స్థానిక యువకులు బల్లా భాను ప్రసాద్, కాలేపు వెంకటేష్, సకిరెడ్డి సతీష్, పలువురు వినియోగదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన మొక్కల నాటివేత

ప్రజాశక్తి, -కూనవరం : మండల కేంద్రంలోని జగ్గవరం క్రాస్‌రోడ్ వద్ద ఈరోజు యుటిఎఫ్.కూనవరం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బాదం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు, భావితరాలకు కాలుష్యంలేని సమాజాన్ని అందించేందుకు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వాతావరణంలో సమతుల్యత లోపించడం వల్లే ప్రస్తుతం అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకుంటున్నాయని, అవి మరింతగా విషమించకముందే ప్రజలంతా మేల్కోవాలన్నారు. మొక్కలను నాటి, వనాలను సంరక్షించడమే దీనికి మార్గమని, అందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం..ప్రమీల, ఆదివాసీ లాయర్ మడివి.రవితేజ పాల్గొన్నారు.

బాదం మొక్క నాటుతున్న యుటిఎఫ్ నేతలు

14 నుంచి 17 వరకు
పర్యాటక ప్రదేశాలు తాత్కాలిక మూసివేత

ప్రజాశక్తి -రంపచోడవరం : ఈనెల 14 నుంచి 17 వరకు తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆయా రోజుల్లో పర్యాటక ప్రాంతాలకు సందర్శకులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. తుపాను, భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు ఎక్కడికక్కడ అధికారులను సిబ్బందిని నియమించామన్నారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలకు కొండ కాలువలు ఉధృతంగా ప్రవహించే ప్రమాదం ఉన్నందున, కాలువల్లోకి దిగి దాటవద్దని సూచించారు. ఏజెన్సీలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

కనులపండువగా దుర్గమ్మ సంబరం

ప్రజాశక్తి -అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం శతకంపట్టు వద్ద ఉన్న కనకదుర్గమ్మ సంబరం శనివారం అత్యంత వైభవంగా సాగింది. దసరా రోజున ఉదయం నుండి అమ్మవారి ఉత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు .ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. గతంలో కంటే ఎక్కువగా భారీ విద్యుత్తు సెట్టింగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు దారిపొడవునా లైటింగ్ అబ్బురపరిచింది. సాయంత్రం నుండి సాగిన అమ్మవారి నవదుర్గల ఊరేగింపు కనుల పండుగగా సాగింది. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి నెహ్రూ చౌక్ మెయిన్ రోడ్ మీదుగా చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ చేపల బజార్ వన్ వే ట్రాఫిక్ నుండి గవరపాలెం వరకు సాగిన నవదుర్గల ఊరేగింపును తిలకించేందుకు ప్రజలు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఎదురేగి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపు తిలకించేందుకు వచ్చిన భక్తులతో మెయిన్ రోడ్ కిటకిటలాడింది. కనకదుర్గ సంఘం పూర్వ అధ్యక్షుడు దాడి జయవీర్ ఆధ్వర్యంలో మేళతాళాలతో నేల వేషాలతో ఊరేగింపు సాగింది. గవరపాలెం పరిసర ప్రాంతాల్లో సుమారు 15 స్టేజ్ ప్రోగ్రాములు తిలకించేందుకు జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు, పోలీసులు చర్యలు చేపట్టడంతో ఉత్సవం ప్రశాంతంగా సాగింది. వ్యవస్థాపకులు పివి. రమణ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు పర్యవేక్షణలో సంబరం అంబరాన్నంటింది.

వడ్డాది : వడ్డాది బ్రాహ్మణ వీధిలో స్థానిక పొగాకు వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి నిమజ్జనోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. .ఈనెల 3 నుండి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. చిటికల భజనలు, కోలాటాలు, మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద బజారు, చిన్న బజారు వీధుల మీదుగా అమ్మవారి ఊరేగింపు సాగింది. పెద్దేరు నదిలో నిమజ్జనోత్సవం చేశారు.

అచ్యుతాపురంలో శూలాలతో మొక్కు తీర్చుకుంటున్న భక్తుడు

పోలీసుల పహారాలో ప్రశాంతంగా దసరా ఉత్సవాలు

అచ్యుతాపురం : మండలంలో పలు గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి.. హరిపాలెం గ్రామంలో రెండు వర్గాల మధ్య ఏర్పడిన వివాదం నేపథ్యంలో అచ్యుతాపురం సిఐ నమ్మి గణేష్ పర్యవేక్షణలో పోలీసుల ప్రత్యేక బందోబస్తు మధ్య దసరా వేడుకలు జరిగాయి. హరిపాలెంలో దసరా ఉత్సవాల సందర్భంగా రెండు గ్రూపుల మధ్య వివాదం తలెత్తగా, కోర్టును ఆశ్రయించడంతో సర్పంచ్ కు అనుకూలంగా స్టేటస్‌కో ఇచ్చింది. దీంతో రెండవ వర్గం గ్రామ రామాలయంలో అమ్మవారి నవరాత్రి కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు వర్గాల మధ్య ఊరేగింపు సమయంలో ఎటువంటి వివాదాలకు రాకుండా పటిష్ట చర్యలు చేపట్టిన పోలీసులు, ముందుగానే ఉత్సవ కమిటీలను హెచ్చరించడంతో వేడుకలు ప్రశాంతంగా ముగిసాయి. హరిపాలెం హరిగిరి కొండపై విజయదుర్గ ఆలయంలోనూ, రామాలయంలో నెలకొల్పిన దుర్గమ్మకు భక్తులు శూలాలు ధరించి మొక్కులు తీర్చుకున్నారు. అందలపల్లి కొండపై భగీరథ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. తిమ్మరాజుపేట గ్రామంలో జగ్గారావు మిత్రమండలి ఆధ్వర్యంలో శూలల ఊరేగింపు. అగ్నిగుండంపై భక్తులు నడిచి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి- చింతూరు: రెగ్యులర్ వర్కర్లతో సమానంగా పనిచేస్తున్న గిరిజన సంక్షేమ హాస్టల్స్ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించి, సమానపనికి సమాన వేతనాలు ఇవ్వాలని సిఐటియు రంపచోడవరం జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం చింతూరులో జరిగిన హాస్టల్ వర్కర్ల సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ రోజు12 నుండి 14 గంటల వరకు పనిచేస్తున్న వీరికి చాలీచాలని వేతనాలను ఇస్తున్నారని, ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసరాలు, ఇతర ధరలతో వీరికిచ్చే జీతంతో కుటుంబపోషణ దుర్భరమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల శాఖలలో రెగ్యులర్ ఉద్యోగాలను నియమించాల్సింది పోయి, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో నియమించుకొని అతి తక్కువ వేతనాలు ఇచ్చి, వారితో వెట్టిచాకిరి చేయించు కుంటున్నారని విమర్శించారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన హాస్టల్ అవుట్సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనాలు, చట్టం ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ , పెన్షన్, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కారుణ్య నియామకాలు అమలు చేయాలనీ డిమాండ్ చేశారు.. హాస్టల్ వర్కర్లకు జిఒ ప్రకారం సెలవులు అమలు, సెలవుల్లో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ముగిసిన దసరా వేడుకలు

-స్పీకర్ అయ్యన్న దంపతులు ప్రత్యేక పూజలు - ఆలయాలు కిటకిట

అయ్యన్న దంపతులకు చిత్రపటాన్ని ఇస్తున్న అర్చకులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: దేవి శరన్నవరాత్రి దసరా వేడుకలు ఘనంగా ముగిసాయి. తొమ్మిది రోజులుగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల శ్రీ దుర్గా మల్లేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దేవి నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలతో పాటు అష్టోత్తర పూజలు, కుంకుమ పూజలు, హోమం వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవి నవరాత్రులు ముగియడంతో బలిఘట్టం, పీనారి పాలెం, గచ్చపు వీధి, శివపురం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు తలపై జ్యోతులను ప్రదర్శించి పురవీధుల్లో జ్యోతి ప్రదర్శన చేశారు. దసరా పండుగ నేపథ్యంలో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆయా ఆలయాల వద్ద ఆలయ కమిటీలు భారీ విద్యుత్ అలంకరణ చేశారు భారీ బాణసంచా కాల్చారు. ఆదివారం సాయంత్రం నర్సీపట్నం దుర్గామల్లేశ్వరి ఆలయంలో దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సతీమణి పద్మావతి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ ఈవో సాంబ శివరావు పూర్ణకుంభంతో స్పీకర్ అయ్యన్న దంపతులను సాదరంగా ఆహ్వానించారు. దుర్గమల్లేశ్వరమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం ఇచ్చి, అమ్మవారి తీర్థ ప్రసాదాలతో పాటు అమ్మవారి ఫోటోను అందజేశారు. ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుకు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, దసరా సందర్భంగా నర్సీపట్నంలో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమంపై అమ్మవారి ఆశీర్వచనాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీని అభినందించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారని తెలిపారు.

ఆలయాలు కిటకిట

నక్కపల్లి: మండలంలోని దుర్గాదేవి ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి పురస్కరించుకొని మండలంలో పలు గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉపమాక, కాగిత, ఎన్ నర్సాపురం, చినదొడ్డిగల్లు, ఉద్దండపురం తదితర గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. ఉపమాక దుర్గాదేవి ఆలయంలో అర్చకులు మహేష్ భక్తుల గోత్రనామములతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు కొప్పిశెట్టి వెంకటరమణ ఏర్పాట్లు చేశారు. కాగిత గ్రామంలో దుర్గాదేవి ఆలయం వద్ద వాహన పూజలు చేశారు.

కొత్తకోటలో కుక్కల బెడద

- భయాందోళన చెందుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోటలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. గ్రామంలో ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఒంటరిగా నడిచి వెళ్లిన వ్యక్తుల తో పాటు వాహనదారుల పై కూడా దాడులు చేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థిని, విద్యార్థులు, వృద్ధులపై సైతం దాడులు చేసి గాయ పరచడంతో తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ కుక్కలు బారినపడి ఇప్పటికే పలువురు గాయలపాలయ్యారు. రాత్రి సమయంలో బిఎన్ రోడ్డు మెయిన్ రోడ్డు పైనే గుంపు గుంపులుగా తిరుగుతూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా స్థానిక పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల ఏరివేత కార్యక్రమం చేపట్టాలని కోరుతున్నారు.

బిఎన్ రోడ్డులో గుంపులుగా వీధి కుక్కలు

మన్యంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు రెండు రోజులుగా పర్యాటకుల సందడి నెలకొంది. జిల్లాలోని ఆయా పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులను అధికంగా సందర్శించారు. అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగూడ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జికె వీధి, సీలేరు, మారేడుమిల్లి దేవి పట్టణం, చింతూరు, మోతుగూడెం ప్రాంతాల్లో సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులతో ఆదివారం రద్దీగా మారాయి. ఆంధ్ర ఊటీగా పిలవబడే అరకు లోయలో పరుచుకున్న మంచు తెరల దుప్పటి కొత్త అనుభవాన్ని పంచుతోంది. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు ప్రస్తుత వాతావరణంలో పొగ మంచు తాకిడిలో ప్రకృతి సోయగాలకు పర్యాటకులు ఉబ్బి తబ్బి అవుతున్నారు. లంబసింగిలోని ప్రస్తుత వాతావరణం పరిస్థితిలో పర్యాటకులు కొత్త అనుభవాలను రుచి చూస్తున్నారు. జిల్లా పర్యాటక ప్రాంతాలను చూసేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. ప్రకృతి అందాలకు ప్రసిద్ది పొందిన బొర్ర గృహాలు, కటికి, తాటిగూడ జలపాతాలు, జలవిహారి, కొత్తపల్లి జలపాతాలతో పాటు పాడేరు మండలంలోని వంజంగి హిల్స్‌లోని మేఘాల కొండపై మంచు అందాలు కూడా పర్యాటకులను ఎంతో ఆకర్షించాయి. అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులంతా ఏజెన్సీకి చేరుకుని ఇక్కడ ప్రకృతి అందాలను వీక్షించారు. పాడేరులోని మోదకొండమ్మ తల్లి, బోడ కొండమ్మ, దారాలమ్మ తల్లి ఆలయాల వద్ద కూడా పర్యాటకుల, భక్తుల రద్దీ నెలకొంది. ఇక్కడ దేవతలను భవాని, అయ్యప్ప మాలధారణ భక్తులతో పాటు ఆయా వర్గాల భక్తులు దర్శించుకున్నారు. హుకుంపేట మండలంలోని పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రమైన మత్స్యగుండంకు కూడా పర్యాటకులు సందర్శించారు.

డుంబ్రిగుడ మండలం చాపరాయి జలపాతం వద్ద పర్యాటకులు

పాడేరులో వంజంగి హిల్స్ వద్ద పర్యాటకులు

చాపరాయి జలపాతం కిటకిట

డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంకు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో కిటకిటలాడింది. జలపాతంలో సరదాగా చిన్న, పెద్ద తేడా లేకుండా స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. చాపరాయి లోని ఉద్యానవనంలో పర్యాటకులు ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు. పర్యాటక ప్రదేశంలో పర్యాటకులు పోటెత్తడంతో సందడి వాతావరణం నెలకొంది.

ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద 1995-2000 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. ఆనాటి జ్ఞాపకాలను ఒకరినొకరు గుర్తుకు తెచ్చుకుంటూ ఆనందంగా ఉత్సాహంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులు సైతం పాల్గొనడంతో వారికి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

గోతులమయంగా ఉన్న రోడ్డు

అధ్వాన రోడ్డుతో అవస్థలు

ప్రజాశక్తి -గొలుగొండ: నర్సీపట్నం నుండి కృష్ణదేవిపేట వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారింది. ప్రధానంగా గొలుగొండ కాలనీ వద్ద రోడ్డు గుంతలు ఏర్పడి పూర్తి పాడైపోయింది. దీంతో, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ రోడ్డుకు కనీసం మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

అధికారులు, నేతలతో మాట్లాడుతున్న అయ్యన్న

పల్లె పండగను జయప్రదం చేయాలి

- స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: 14వ తేదీ నుండి జరిగే పల్లె పండుగ కార్యక్రమంపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం సాయంత్రం ఆయన ఇంటి వద్ద నియోజకవర్గ మండల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, నర్సీపట్నం నియోజకవర్గం మండలాల్లోని పంచాయతీల అభివృద్ధికి ఎన్ఆర్ఇజిఎ ఎస్ నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.13 కోట్ల ఉపాధి హామీ నిధుల నుండి అభివృద్ధి కార్యక్రమాల కోసం మంజూరు చేశామన్నారు. ఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల కోసం పల్లె పండుగ పేరుతో పంచాయతీ వారోత్సవాలు ప్రతి గ్రామంలో చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాలను పండగలా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రామ సమస్యలు, అభివృద్ధి పై చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ ఈశ్వరరావు, జెడ్పిటిసి సుకల రమణమ్మ, టిడిపి మండల అధ్యక్షులు లాలం శ్రీరంగ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వినోద ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసాయి. ఉత్సవాలు ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమా చార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి, డోలా ఉత్సవము, వినోదోత్సవం, చక్రవారీ స్నానం, కంకణ విసర్జనలు, విశేష పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు పలువురు భక్తులను ఉంగరం కోసం విచారణ చేపడుతూ తంతు నిర్వహించారు. చివరికి స్వామివారి వస్త్రములోనే ఉంగరం ఉన్నట్లు గుర్తించి వెల్లడించడంతో భక్తులందరూ ఆనందం వ్యక్తం చేశారు.

మండలంలోని ఉపమాకలో విజయదశమి పర్వదినం పురస్కరించుకుని అర్చకులు శమీ పూజ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను పుణ్యకోటి వాహనంలో అధిష్టింపజేసి బంధుర సరస్సు వద్ద లంక వారి మండపం వద్దకు తీసుకుని వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మి చెట్టుకు విశేష పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీకి చెందిన గజముఖ నృత్య అకాడమీకి చెందిన 12 మంది విద్యార్థులు మాడి వీధుల్లో నృత్యం చేశారు. ఈ సందర్భంగా నృత్య అకాడమీ నిర్వాహకులు ధనం మాస్టర్ మాట్లాడుతూ, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తమ నృత్య అకాడమీకి చెందిన విద్యార్థులకు శ్రీవారి రథం ముందు నృత్యం చేసే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ప్రమాదకరంగా అంత్రిగుడ మలుపు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న 516 ఈ జాతీయ రహదారి అంత్రిగుడ మలుపు ప్రమాద కరంగా మారింది. ఇక్కడ తరచుగా వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. చాప రాయి జల పాతంకు తరచుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతుండటంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం సమీపంలో ఉండటంతో పాటు అరుకు, పాడేరు జిల్లా కేంద్రానికి ఈ రోడ్డు ప్రధాన రోడ్డు కావడంతో ఈ రోడ్డు గుండా నిత్యం వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తున్నాయి. వాహనాల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అంత్రిగుడ మలుపు ఇదే

హెటిరో వ్యర్థ రసాయన జలాలతో

ఉప్పుటేరులో చేపలు మృత్యువాత

కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం నేతలు, మత్స్యకారుల డిమాండ్

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో రసాయన వ్యర్థ జలాలు ఉప్పుటేరులో కలవడం వల్ల సుమారుగా ఐదారు టన్నుల చేపలు మృత్యువాత పడ్డాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజయ్యపేట సమీపంలో దొండవాక మొగ ఒడ్డుకు మృతి చెందిన చేపలు భారీగా చేరుకున్నాయి. విషయం తెలుసుకున్న సిపిఎం నేత అప్పలరాజు, మత్స్యకారులతో కలిసి ఉప్పుటేరు వద్దకు చేరుకుని మృతి చెందిన చేపలను పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ. హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ కంపెనీలో వాడుతున్న వ్యర్థ రసాయన జలాలను శుద్ధి చేయకుండా, యదేచ్ఛగా, పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ పక్కనే ఉన్న ఉప్పు టేరులో వదలడంతోనే టన్నుల కొద్ది చేపలు మృత్యువాత పడ్డాయన్నారు. దీంతో, మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే కాలుష్య నియంత్రణ మండలి, మత్స్యశాఖ అధికారులు వెంటనే స్పందించి ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. హెటిరో డ్రగ్స్ యాజమాన్యం పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, యాజమాన్యం నుండి మత్స్యకారులకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కంపెనీ యాజమాన్యం పర్యావరణ ఉల్లంఘన లకు పాల్పడుతున్నా అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడంతోనే ఈ విధమైన సంఘటనలు పునరావృతం అవుతున్నాయని విమరిశంచారు. వెంటనే అధికారులు స్పందించి హెటిరో యాజమాన్యం పై చర్యలు తీసుకుని మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. హెటిరో కంపెనీ నుండి వెలువడే కాలుష్యం కారణంగా తమ ఉనికి ప్రమాదకరంగా మారిందని మత్స్యకారులు ఆవేదన వెలిబుచ్చారు. చేపలు వేట తప్ప మరో వృత్తి తమకు తెలియదన్నారు.హెటిరో కాలుష్యం కారణంగా తమ బతుకులు ఆగమ్యగోచరంగా మారాయిని ఆవేదన చెందారు. కంపెనీ వ్యర్థ జలాలు ఉప్పుటేరులో కలవకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మృతి చెందిన చేపలను చూపుతున్న మత్స్యకారులు, సిపిఎం నేత అప్పలరాజు

మత్స్యకారుడు కోడ మునలి మాట్లాడుతూ తాను ఉప్పుటేరులో చేపలు వేట చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, చేపలు పట్టేందుకు ఉప్పుటేరులో వలవేస్తే మృతి చెందిన చేపలు వలలో పడ్డాయని, దుర్వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. చేపలు మందులు వాసన వేయడం వలన కొనుగోలు చేసేందుకు కూడా ఎవ్వరూ ముందుకు రాలేదని రిన పడుతున్నారని ఆవేదన వెలబుచ్చాడు. తమను పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల నాయకులు జీ.సోమేశ్వరరావు, బి.నూకరాజు, కె.కాశీరావు, సి.హెచ్ సోమేష్, గుర్రన్న, కె.కాశీ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా చేపలు, మాంసం విక్రయాలు

నక్కపల్లిలో చికెన్ షాప్ వద్ద రద్దీ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని దసరా సందర్భంగా ఆదివారం మాంసం దుకాణాలు జనం రద్దీతో కిటకిట లాడాయి. చికెన్, షాపులు వద్ద మాంసం కొనుగోలు చేసేందుకు జనం ఎగబడ్డారు. ఏ షాపు వద్ద చూసినా జనం రద్దీ కనిపించింది. చికెన్ కిలో రూ 240 నుంచి రూ. 250 ల చొప్పున విక్రయించారు. నిన్న మొన్నటి వరకు కిలో రూ.200 లకు లభించే చికెన్ ఒకేసారి రూ.40 నుంచి రూ.50 లకు పెరిగింది. ధర పెరిగినప్పటికీ జనం మాంసం కోసం ఎగబడ్డారు. మటన్ కిలో రూ. 900 ల చొప్పున విక్రయించారు.

బుచ్చయ్యపేట : శనివారం దసరా పండగ రావడంతో మాంసం ప్రియులు పండగను ఆదివారానికి వాయిదా వేసుకున్నారు. దీంతో ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో మాంసం దుకాణాల వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. వడ్డాది బుచ్చయ్యపేట విజయరామరాజుపేట రాజాం సీతయ్యపేట తదితర గ్రామాల్లో గల చికెన్ షాపుల వద్ద గంటలు తరబడి చికెన్ కొనుగోలుకు వినియోగదారులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. చికెన్ ధరలు కాస్త పెరిగాయి.కిలో రూ. 240 నుంచి రూ.250 మధ్య అమ్మకాలు చేపట్టారు. ప్రతి ఆదివారం జరుగు వడ్డాది సంత దసరా పండగ మర్నాడు కూడా వ్యాపారులతో కళకళలాడింది. పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో రైతులు మేకలు, గొర్రెలు, కోళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. కొనుగోలుదారులు సంత కిటకిటలాడింది.

అచ్యుతాపురం : దసరా సందర్భంగా ఆదివారం చికెన్, మటన్‌తోపాటు చేపల దుకాణాలు కిటకిటలాడాయి. శనివారం దసరా కావడంతో ఆ రోజున మాంసాహారాన్ని తీసుకోని వారంతా ఆదివారం పండుగను జరుపుకోవడంతో చికెన్, మటన్, చేపల విక్రయాలు జోరుగా సాగాయి. ఆదివారం కావడంతో కార్మికులు, ఉద్యోగులకు సెలవు కావడంతో మాంసం చేపల దుకాణాలు కిక్కిరి సాయి. దసరా పండగకు దూరప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు ఆదివారం సాయంత్రం తిరిగి ప్రయాణం అయ్యారు. ప్రయాణికులతో ఆటోలు బస్సులు రద్దీగా తిరిగాయి. భవాని మాలలు ధరించిన భక్తులు అచ్చుతాపురం నుంచి పరిసర గ్రామాల నుంచి కార్లు ట్రైన్‌ల పై విజయవాడ అమ్మవారి దర్శనానికి వెళ్లారు.మాలాధారణ చేసిన భక్తులు, నవరాత్రుల్లో దీక్షలు పూర్తిచేసి, వాటిని అమ్మవారి ఆలయంలో విసర్జించారు.

సమస్యలు పరిష్కరించాలని హోం మంత్రికి వినతి

ప్రజాశక్తి- నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గం లో జనవాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించాలని కోరుతూ జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ పార్టీ నాయకులతో కలిసి హెూం మంత్రి వంగలపూడి అనితకు ఆదివారం నక్కపల్లిలో ఆమె స్వగృహం నందు వినతిపత్రం అందజేశారు. జనవాణి కార్యక్రమంలో భాగంగా సుమారుగా నెల రోజుల నుండి ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించడం జరిగిందని శివదత్ అన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి, సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు చేపడతానని హెూం మంత్రి అనిత అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్‌ను హెూం మంత్రి వంగలపూడి అనిత సత్కరించారు. గడచిన 5 సంవత్సరాలుగా పౌర సరఫరాల విభాగం నిర్వీర్యం అయిందని, గాడిలో పెట్టి నాణ్యమైన సేవలు ప్రజలకు అందేలా కృషి చేయాలని అనిత సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనితకు వినతిపత్రం అందజేస్తున్న జనసేన శ్రేణులు

ఎస్ఐగా తారకేశ్వరరావు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలం లోని కృష్ణదేవిపేట ఎస్సైగా వై.తారకేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఇంటిలిజెన్స్‌లో విధులు నిర్వహిస్తూ ఇక్కడ ఎస్సైగా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై టి.దివ్య అనకాపల్లి ఎస్‌బీకి జిల్లా అధికారులు బదిలీ చేశారు.